సాక్షి
కుమురం భీం
శనివారం ၊ 3 ၊ మే ၊ 2025



కలియదున్నితే భూసారం

వరి కొయ్యలు కాల్చితే వాతావరణ కాలుష్యంతోపాటు భూసారం దెబ్బతింటుంది. కొయ్యలను కలియదున్నాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 10లో▸



కెమెరాలో వన్యప్రాణులు

ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలో కెమెరాలు అమర్చారు. అడవి దున్నలు, నీలుగాయిలు, చుక్కల దుప్పులు, నెమళ్లు కెమెరాలకు చిక్కాయి. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.8 /26.7

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేడి అధికంగా ఉంటుంది. రాత్రి వరకు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నీట్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 4న నిర్వహించే నీట్(యూజీ) కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని, 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్ష రాసేవిధంగా పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. పొరపాట్లకు తావులేకుండా అభ్యర్థి బయోమెట్రిక్, ఐడెంటిఫికేషన్‌లో సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తుండగా, అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు లోపలికి అనుమతిస్తారని తెలిపారు. అడ్మిట్ కార్డులతోపాటు గుర్తింపు కార్డు, రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు. మాస్క్, సాక్స్‌లు, బెల్ట్, ఆభరణాలకు అనుమతిలేదన్నారు. హాఫ్ హ్యాండ్ షర్ట్ మాత్రమే వేసుకుని రావాలని సూచించారు. కేంద్రాల సమీపంలో జిరాక్స్, ఇంటర్నెట్, దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాల తరలింపు కోసం పూర్తిస్థాయి బందోబస్తు నియమించినట్లు తెలిపారు. కేంద్రాలకు చేరుకునే సమయంలో ఇబ్బందులుంటే పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా పట్టుదలతో ముందుకెళ్లాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మొదటిసారి ఉత్తీర్ణత సాధించిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులను శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, నాయకులు రవీందర్, మల్లేశ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడానైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, క్రీడానైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని ఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును శుక్రవారం పరిశీలించారు. ప్రతీ శిబిరంలో కనీసం 70 నుంచి 80 మంది ఉండేలా చూడాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి

తిర్యాణి(ఆసిఫాబాద్): వేసవి క్రీడాశిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్‌వో రమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో క్రీడాశిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. డీవైఎస్‌వో మాట్లాడుతూ విద్యార్థులకు పది క్రీడాంశాల్లో శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, క్యాంపు ఇన్‌చార్జి గుండం లక్ష్మణ్, పీఈటీలు సుభాశ్, శ్రీను, విద్యాసాగర్, రవీందర్ పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో 2025- 26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు డీఐఈవో కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31లోగా ఇంటర్ అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు. అడ్మిషన్లు పూర్తయిన వారికి జూన్ 2 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో నోటిఫికేషన్ నం.1/2025 ఔట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయనున్న 52 పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.https:// gmck umurambheemasifabad.or-g, https ://asifabad.telangana.gov.in వెబ్‌సైట్లలో జాబితాను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అభ్యర్థులకు అభ్యంతరాలు ఉంటే ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా రాతపూర్వకంగా కళాశాలలో సమర్పించాలని సూచించారు.

సూపర్ బజార్ బంద్!

- గోలేటిటౌన్‌షిప్‌లో తెరుచుకోని సింగరేణి సూపర్‌బజార్
- నిత్యావసర సరుకులకు కిరాణ దుకాణాలే ఆధారం
- ఇబ్బందులు పడుతున్న కార్మిక కుటుంబాలు



గోలేటిలో మూసి ఉన్న సింగరేణి సూపర్‌బజార్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికులకు నాణ్యమైన సరుకులు బయటి మార్కెట్ కంటే తక్కువ ధరకే అందించేందుకు సూపర్‌బజార్లను ఏర్పాటు చేసింది. కార్మిక కుటుంబాల అవసరాలకు అనుగుణంగా సరుకులు అందించడంతో ప్రారంభంలో సూపర్‌బజార్లు విజయవంతంగా నడిచాయి. కాలక్రమంలో ఆసక్తి సన్నగిల్లడం, అవసరాలకు తగినట్లు సరుకులు అందుబాటులో లేకపోవడంతో అవి లక్ష్యానికి దూరమయ్యాయి. ఇందులో భాగంగా బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో ఉన్న సూపర్‌బజార్ సైతం మూతబడింది. కార్మిక కుటుంబాలు బయట మార్కెట్‌లో అధిక ధరలకు సరుకులు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

పరిస్థితులు మారినా..

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ యుగం నడుస్తోంది. మారుమూల ప్రాంతాలకు సైతం ఈ-కామర్స్ సంస్థలు సేవలు విస్తరించడంతో ఇంట్లో ఉండి కావాల్సిన వస్తువులు ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సింగరేణి సంస్థ సూపర్‌బజార్లను పరిస్థితులకు అనుగుణంగా అప్‌డేట్ చేయలేకపోయింది. ఫలితంగా సూపర్ బజార్లకు వచ్చే కార్మిక కుటుంబాల సంఖ్య తగ్గి ఆదరణ తగ్గిపోయింది. అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంచకపోవడం, సకాలంలో సరుకులు తెప్పించకపోవడంతో బయటి మార్కెట్‌కు వెళ్లేందుకు మొగ్గు చూపారు. కార్మిక కుటుంబాలకు అవసరమైన అన్నిరకాల వస్తువులను అందుబాటులో ఉంచి తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు అందించేలా ఏర్పాట్లు చేస్తే తిరిగి పూర్వవైభవం వచ్చే అవకాశం ఉంది.

క్రెడిట్‌పై సరుకులు

సింగరేణి సూపర్‌బజార్లలో కార్మికులు క్రెడిట్‌పై నిత్యావసరులు తీసుకువెళ్లే అవకాశాన్ని యాజమాన్యం కల్పించింది. నెలాఖరు సమయంలో కుటుంబాలు నిత్యావసరాలు తెచ్చుకునే వెసులుబాటుతో కొంతమేర ఇబ్బందులు తగ్గేవి. క్రెడిట్‌పై తీసుకున్న సరుకులకు సంబంధించిన నగదును కార్మికుడి వేతనం నుంచి కట్ చేసేవారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా కుటుంబానికి సరుకులు లభిస్తాయనే ధీమా ఉండేది. కానీ సూపర్‌బజార్లు మూతపడటంతో నెలాఖరు సమయంలో కార్మిక కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. నిత్యావసరాలతోపాటు ఎలక్ట్రికల్ వస్తువులను సైతం సూపర్ బజార్ల ద్వారా అందించేవారు. కాలక్రమేణా యాజమాన్యం సూపర్‌బజార్ల నిర్వహణను గాలికొదిలేయడం, అందుబాటులో సరుకులు ఉంచకపోవడం, సిబ్బంది అవినీతికి పాల్పడటం వంటి కారణాలు సూపర్‌బజార్లను మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయి.

మారుమూల ప్రాంతాల్లో అవసరం

గోలేటిటౌన్‌షిప్ వంటి మారుమూల ప్రాంతాల్లో పనిచేసే కార్మికులకు సింగరేణి సూపర్‌బజార్లు ఎంతో అవసరం. గోలేటి నుంచి బెల్లంపల్లి, కాగజ్‌నగర్, మంచిర్యాల వంటి పట్టణ ప్రాంతాలకు వెళ్లాలంటే కనీసం 20 నుంచి 50 కిలోమీటర్లు ప్రయాణించాలి. పట్టణ ప్రాంతాల్లో డీమార్ట్, మోర్ మార్కెట్, రిలయన్స్ ఫ్రెష్ వంటి సూపర్ మార్కెట్లు అందుబాటులో ఉన్నాయి. మారుమూల ప్రాంతమైన గోలేటిలో అలాంటి మార్కెట్‌లు లేవు. కార్మిక కుటుంబాలు, పరిసర ప్రాంతాల ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో నిత్యావసర సరుకుల కోసం కిరాణషాపులపైనే ఆధారపడాల్సి వస్తోంది. స్థానికంగా సూపర్‌బజార్ ఉన్నప్పటికీ కొంతకాలంగా దానిని మూసివేసి ఉంచడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అన్నిరకాల వస్తువులను అందుబాటులో ఉంచి తిరిగి సూపర్‌బజార్‌ను ప్రారంభించాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.

అందరికీ ఉపయోగం



గోలేటిలో సింగరేణి సూపర్ బజార్ తిరిగి తెరిస్తే సింగరేణి ఉద్యోగులతోపాటు అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. బయటి దుకాణాలతో పోల్చితే అక్కడ సరుకులు తక్కువ ధరకే నాణ్యతతో దొరుకుతాయి. కొన్నేళ్లుగా కావాల్సిన సరుకులు అందుబాటులో ఉంచకపోవడంతో ఎవ్వరూ వెళ్లలేదు.

– చల్లూరి అశోక్, కాంట్రాక్టు కార్మికుడు

తిరిగి ప్రారంభించాలి



గోలేటిలో సింగరేణి సూపర్‌బజార్‌ను తిరిగి ప్రారంభించడం ఎంతో అవసరం. నాణ్యతమైన సరుకులు తక్కువ ధరకు కావాలంటే బెల్లంపల్లి, మంచిర్యాలకు వెళ్లాల్సి వస్తోంది. అందుబాటులో సూపర్‌బజార్‌ను కొంతకాలంగా తెరవడం లేదు. కిరాణాల్లో సరుకులు కొంటున్నాం.

– రాయిల్ల నర్సయ్య, కాంట్రాక్టు కార్మికుడు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



గోలేటిలోని సింగరేణి సూపర్‌బజార్ తిరిగి ప్రారంభించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అన్ని రకాల వస్తువులు ఉండకపోవడంతో కార్మిక కుటుంబాలు సైతం వెళ్లడం లేదు. సూపర్‌బజార్లలో పనిచేసిన సిబ్బంది అవినీతికి పాల్పడ్డారనే సాకుతో వీటిని మూసివేశారు. తిరిగి తెరిపించేందుకు ఏఐటీయూసీ కృషి చేస్తోంది.

– బి.జగ్గయ్య, ఏఐటీయూసీ బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి

రయ్.. రయ్..!

- పగలు రోడ్లు.. రాత్రిళ్లు రేస్ ట్రాక్‌లు
- రేసింగ్, మందుబాబుల డేంజర్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు
- జిల్లా కేంద్రంలో దడ పుట్టిస్తున్న బైకర్లు

ఈ ఏడాది జిల్లా కేంద్రంలో కేసులు

డ్రంకెన్ డ్రైవ్	ర్యాష్,రాంగ్‌రూట్
298	77

సాక్షి, ఆసిఫాబాద్: పగలు.. రాత్రి తేడా లేదు. ఖరీదైన బైకులు జిల్లా కేంద్రంలోని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. సాయంత్రం దాటితే చాలు ప్రధాన రహదారులు రేసు ట్రాకుల్లా మారుతున్నాయి. మంచిర్యాల– నాగ్‌పూర్ జాతీయ, పట్టణ రహదారులపై ప్రయాణం అంటేనే పట్టణ ప్రజలకు వెన్నులో వణుకుపుట్టిస్తోంది. ఖరీదైన కార్లు, బైకులతో దూసుకెళ్లడం.. ఒళ్లు తెలియనంతలా తప్పతాగి బండి నడపడం.. వెరసి ఎప్పుడు ఏవైపు నుంచి ఏ వాహనం ఢీకొడుతుందో తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా మందుబాబుల డ్రైవింగ్ పాదాచారుల ప్రాణాల మీదకొస్తోంది. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలతో కొంత నిలువరిస్తున్నా కొందరు మాత్రం అడ్డదారుల్లో రహదారుల మీదకు దూసుకొస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 298 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం గమనార్హం. ఈ ఏడాది జనవరి నెలలో ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన ఓ యువకుడు వాంకిడి నుంచి ద్విచక్రవాహనంపై తప్పతాగి వేగంగా ఆసిఫాబాద్‌కు వస్తూ టోల్‌గేట్ సమీపంలో గొర్రెల మందను ఢీకొట్టగా ఎనిమిది గొర్రెలు చనిపోగా.. తీవ్రంగా గాయపడిన యువకుడిని హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స అనంతరం అతడు ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. గత నెలలో బూర్గుడ జిన్నింగ్ మిల్లు వద్ద రాంగ్‌రూట్ వస్తున్న వాహనాన్ని మరో వాహనం ఢీకొనగా ఒకరికి గాయాలయ్యాయి. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నా నియంత్రించడం సాధ్యపడడం లేదు.

రాంగ్‌రూట్.. డేంజర్ డ్రైవింగ్..

కేస్లాపూర్ పెద్దవాగు బ్రిడ్జిపై రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనదారుల తీరుతోనూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించడం పోలీసులకు సాధ్యపడటం లేదు. ఆ వంతెనపై పోలీసులు ఎవరైనా విధుల్లో ఉన్నా వారి కళ్లుగప్పి వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళ్లడం పరిపాటిగా మారింది. ద్విచక్ర వాహనాలకు తోడు ఆటోలు సైతం పదుల సంఖ్యలో నిత్యం ప్రయాణికులతో నిబంధనలకు విరుద్ధంగా రాంగ్‌రూట్‌లో బ్రిడ్జి దాటుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దడ పుట్టిస్తూ..

జాతీయ రహదారిపై ఆకతాయిలు, పోకిరీలు స్టంట్లు వేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట మరింత దారుణ పరిస్థితులు నెలకొంటున్నాయి. వారాంతాల్లో యువకులు బైక్ రేసింగ్‌లు నిర్వహిస్తూ.. వేగంగా దూసుకెళ్తూ అవతలి వ్యక్తుల్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. నిందితుల్ని పట్టుకున్నా నిర్లక్ష్యపు డ్రైవింగ్ కింద కేసు నమోదుకే పోలీసులు పరిమితమవుతున్నారు. పోలీసులు వారాంతాల్లో తప్పనిసరిగా, మిగిలిన రోజుల్లో ఆకస్మికంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. ఇవీ నిర్ణీత సమయం వరకే ఉండటంతో ఆ తర్వాత మందుబాబులు చెలరేగిపోతున్నారు. అర్ధరాత్రి తర్వాత రోడ్డు ప్రమాదాలకు ఇదీ ఓ కారణంగా నిలుస్తోంది.

అత్యవసరమైనా.. ఆగాల్సిందే



రెబ్బెన మండల కేంద్రంలోని రైల్వేగేట్‌తో ట్రాక్‌కు అవతల ఉన్న గ్రామాల ప్రజలు ప్రతిరోజూ నరకం అనుభవిస్తున్నారు. ఎంతటి ఆపద ఉన్నా.. గేట్ పడిందంటే నిరీక్షించాల్సిందే. అత్యవసర సేవలు అందించే 108 వాహనం సైతం శుక్రవారం ఇలా రోగులతో గేటు వద్దే ఆగిపోయింది. ఒక్కోసారి గేట్ పడితే నాలుగైదు రైళ్లు వెళ్లే వరకు తీయడం లేదు. ట్రాక్‌కు అవతలి వైపు సుమారు 12 గ్రామపంచాయతీలు ఉన్నాయి. రైల్వే గేట్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని మండలవాసులు ఏళ్లుగా కోరుతున్నా.. ప్రభుత్వాలు, రైల్వే అధికారులు స్పందించడం లేదు. – రెబ్బెన

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్: రైసింగ్ అండ్ ఆక్సిలరేటింగ్ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ కేంద్ర ప్రభుత్వ పథకంలో ఒప్పంద పద్ధతిన మేనేజర్, సహాయ మేనేజర్ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అశోక్ తెలిపారు. ర్యాంప్ పథకం ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా రంగాల అభివృద్ధికి మార్కెట్, సాంకేతిక ఆధునీకరణ పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన సంస్థ అభివృద్ధి కేంద్రంలో మేనేజర్, సహాయ మేనేజర్ పోస్టులు ఒప్పంద పద్ధతిన భర్తీ చేయనున్నట్లు వివరించారు. అర్హులు ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు www.nimsme.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

కేంద్రమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పర్యటనకు సంబంధించి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పరిశీలించారు. రూ.3,500 కోట్లతో నిర్మించిన నాలుగు వరుసల జాతీయ రహదారిని ఈ నెల 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ సభాస్థలి, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ సభకు హాజరయ్యే ప్రముఖులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. వాహనాల పార్కింగ్, భోజనం, తాగునీటి వసతులు కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, ప్రాజెక్టు డైరెక్టర్ మణికుమార్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎస్సై చంద్రశేఖర్, డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ ఇమ్రాన్, ఈవెంట్ మేనేజర్ అనూప్ పాల్గొన్నారు.

టవర్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్: జిల్లాలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ టవర్ల నిర్మాణం వేతవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎఫ్‌డీవో సుశాంత్ బోగాడేతో కలిసి తహసీల్దార్లు, రేంజ్ అధికారులు, బీఎస్ఎన్ఎల్ అధికారులతో టవర్ల నిర్మాణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు మొబైల్ నెట్‌వర్క్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నూతన టవర్ల నిర్మాణానికి స్థలాల ఎంపిక వేగవంతం చేయాలని, అవసరమైన చోట అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కాగజ్‌నగర్ తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 4 నిర్వహించే నీట్ పరీక్షకు అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని ఒక ప్రకటనలో సూచించారు. పరీక్షకు 287 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, ఇందులో 209 మంది మహిళలు, 78 మంది పురుషులు ఉన్నారని తెలిపారు.

పొదుపుగా విద్యుత్ వినియోగించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కౌటాల(సిర్పూర్): వినియోగదారులు పొదుపుగా విద్యుత్ వినియోగించాలని ఆ శాఖ ఎస్ఈ శేషారావు అన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ ఆదా చేయాలని, ఇళ్లలో ఎల్ఈడీ బల్బులు వినియోగించాలని సూచించారు. నాణ్యమైన వైర్లు, స్విచ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదానికి గురైన వ్యక్తిని కర్ర, ప్లాస్టిక్ పరికరాలతో కాపాడాలని సూచించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈ వీరేశం, ఏడీఈ రాజేశ్వర్, శ్రీకాంత్, అంజల్‌కుమార్, ఫోర్‌మెన్ నర్సింగరావు పాల్గొన్నారు.

ఒకేసారి నెలరోజుల సరుకులు

- అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు
- నేటి నుంచి సరుకుల పంపిణీకి అధికారుల కసరత్తు



ఆసిఫాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఆయా కేంద్రాల ద్వారానే ప్రభుత్వం పాలు, గుడ్లు, బాలామృతం సరఫరా చేస్తోంది. అయితే ఈ నెల 1 నుంచి 31 వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవిలో నెల రోజుల సరుకులు ఒకేసారి అందించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా అధికారులకు సంబంధిత ఉత్తర్వులు అందాయి.

జిల్లాలో 973 కేంద్రాలు

జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో గర్భిణులు 4,356 మంది, బాలింతలు 4,022 మంది, ఏడు నెలలలోపు చిన్నారులు 4,146 మంది, ఏడు నెలల నుంచి ఏడాదిలోపు వారు 4,549, ఏడాది నుంచి మూడేళ్ల లోపు వారు 15,872 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు వారు 20,055 మంది ఉన్నారు. జిల్లా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మొత్తం 44,702 మందికి లబ్ధి చేకూరుతోంది. ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో 296 అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, 352 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. ఫ్రీ రెంట్ కింద 325 కేంద్రాలు నడుస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రతిరోజూ ఒకరికి 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, 5 గ్రాముల నూనె, ఒక కోడిగుడ్డు అందిస్తున్నారు. బాలింతలు, గర్భిణులకు ఒక్కొక్కరికి 150 గ్రాముల బియ్యం, 30 గ్రాముల పప్పు, 200 మిల్లీ లీటర్ పాలు, 16 గ్రాముల నూనె, ప్రతిరోజూ ఒక కోడిగుడ్డు ఇస్తున్నారు. వేసవి సెలవుల సందర్భంగా శనివారం నుంచి నెల రోజులకు సరిపడా సరుకులను ఒకేసారి అందించనున్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తర్వులు అందాయి



అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఒకేసారి నెల రోజులకు సరిపడా సరుకులు అందించనున్నాం. ఇదివరకే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు కూడా అందాయి. లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి టీచర్ల ద్వారా సరుకులు తీసుకోవాలి.

– భాస్కర్, జిల్లా సంక్షేమ అధికారి

‘బెల్లంపల్లి’లో 78శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి జీఎం నరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా ఏప్రిల్‌లో 78 శాతం ఉత్పత్తి సాధించిందని ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్ తెలిపారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏప్రిల్‌లో ఏరియాకు 3.50 టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 2.74 లక్షల టన్నులతో 78 శాతం ఉత్పత్తి సాధించిందన్నారు. ఖైరిగూడ ఓసీపీ ద్వారా మాత్రమే ప్రస్తుతం ఉత్పత్తి కొనసాగుతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియాకు 35 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని యాజమాన్యం నిర్దేశించిందని పేర్కొన్నారు. ఓసీపీలో కొన్ని రకాల పనులతో ఉత్పత్తి తగ్గిందన్నారు. ఖైరిగూడ ఓసీపీలో మరో మూడేళ్లపాటు బొగ్గు ఉత్పత్తి కొనసాగుతుందని, చివరి దశ పనులతో మొత్తంగా నాలుగేళ్లపాటు ఖైరిగూడ ఓసీపీ కొనసాగుతుందని తెలిపారు. ఆ లోపు గోలేటి ఓసీపీ, మాదారం ఓసీపీలను ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహారా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్‌కు రాజీనామా

మంచిర్యాలఅర్బన్: టీజీఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆదిలాబాద్ రీజియన్ కార్యదర్శి పదవికి భీమేశ్వర్‌రావు శుక్రవారం రాజీనామా చేశారు. గతంలో కార్మికుల సమ్మె తర్వాత వారి అనేక సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో యూనియన్ రాష్ట్ర నాయకత్వం విఫలమైందని ఆరోపించారు. సమస్యలపై నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శికి రాజీనామా లేఖను పంపినట్లు పేర్కొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ



క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. శుక్రవారం వేకువజామున పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు అనంతరం నది ఒడ్డున శివాలయంలో భక్తులు పూజలు చేశారు. అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు చిన్నారులకు అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు చేయించారు. అనంతరం శ్రీ జ్ఞాన సరస్వతి, మహాంకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

గోదావరికి హారతి



హారతి ఇస్తున్న వేద పండితులు

బాసర: బాసరలో గోదావరి నదికి శుక్రవారం హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వేద భారతి పీఠం, గ్రామస్తుల ఆధ్వర్యంలో గోదారమ్మ తల్లికి పూజలు చేశారు. వేద పాఠశాల విద్యార్థులు పంచ, నాగ హారతిని ఇచ్చారు. వేద విద్యానంద గిరిస్వామి, భక్తులు తదితరులు ఉన్నారు.

ఆటో దగ్ధం



దగ్ధమైన ఆటో

బాసర: బాసర ట్రిపుల్ ఐటీ వద్ద శుక్రవారం ఆటోలో మంటలు చెలరేగి దగ్ధమైంది. భైంసా పట్టణానికి వెళ్తున్న ఆటోలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో డ్రైవర్ తప్పించుకున్నాడు. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అటుగా వెళ్తున్న కొందరు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎండ తీవ్రత వల్ల ప్రమాదం సంభవించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మీ ఇంటివద్దనే ఉంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేల వరకు సంపాదించుకోండి. ఆఫీస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25003066]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రత్యుత్తరం ఇవ్వవలసిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారుడు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు, పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

కెమెరాలో వన్యప్రాణులు

జన్నారం: వన్యప్రాణుల గణనలో భాగంగా ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలో ఇటీవల కెమెరాలు అమర్చారు. ఇందులో అనేక వన్యప్రాణులు కనిపించినట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో అమర్చిన కెమెరాలో అడవి దున్నలు, నీలుగాయిలు, చుక్కల దుప్పలు, నెమళ్లు చిక్కాయి. అత్యధికంగా చుక్కల దుప్పలు పిల్లలతో కనిపించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.



తల్లితో చుక్కల దుప్పి పిల్ల



నెమలి



చుక్కల దుప్పి



అడవి దున్న

కలియదున్నితే భూసారం

- వరి కొయ్యలు కాల్చితే కాలుష్యం
- దిగుబడిపై ప్రభావం

లోకేశ్వరం: వరి కోతలు పూర్తవుతున్నాయి. వానాకాలం సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. పొలాన్ని దుక్కి దున్నడానికి అడ్డంగా ఉన్న వరి కొయ్యలను కాల్చడంలో నిమగ్నమయ్యారు. కొయ్యలు తగలబెడితే వెలువడే పొగతో వాతావరణ కాలుష్యంతోపాటు భూసారం దెబ్బతింటుంది. సూక్ష్మపోషకాలు నశిస్తాయి. పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంది. భవిష్యత్తులో సేద్యం కష్టమవుతుంది. ఈ విపత్తును తప్పించడానికి రైతులంతా కొయ్యలను కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయ ఆధారితమైన జిల్లాలో యాసంగి సీజన్ పూర్తికానుంది. జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. రైతులు యంత్రాలతో కోతలు చేపట్టారు. పొలాల్లో వరి కొయ్యలతోపాటు పంట వ్యర్థాలు మిగిలిపోయాయి. వీటిని తొలగించి పొలాన్ని దుక్కి దున్నడానికి కొయ్యలను తగలబెడుతున్నారు. కలియదున్నాలంటే చాలా సమయం పడుతుందని, ఖర్చుతో కూడుకుందని భావిస్తున్నారు. ఒక్కసారి మంట అంటిస్తే గంటలో కాలిపోతుందనే ఆలోచనలో ఉన్నారు. ఈనేపథ్యంలో రైతులకు వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.



ధర్మోరలో వరి కొయ్యలకు నిప్పుపెట్టడంతో కాలిన పైపులు

ఉపయోగాలు..

- కలియ దున్నడంతో వరికొయ్యలు మట్టిలో కలిసిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది.
- నత్రజని, భాస్వరం, సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయి.
- సేంద్రియ కర్బన్ శాతం పెరుగుతంది.
- భూసారం పెరిగితే యాసంగిలో వాడే ఎరువులను 30 నుంచి 40 శాతం తగ్గించుకోవచ్చు.
- వానపాములు పెరిగి భూమి సారవంతమవుతుంది.

ఇలా చేయాలి..

- పొలాన్ని రోటవేటర్‌తో కలియదున్నాలి. వరి కొయ్యలు చిన్నచిన్న ముక్కలుగా మారుతాయి.
- దుక్కికి నీళ్లు పెట్టి ఎకరాకు 100 గ్రాముల సింగిల్ సూపర్ పాస్ఫేట్ చేసి 15 నుంచి 20 రోజులు పొలాన్ని నానబెట్టాలి.
- కొయ్యలు పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతాయి.

నష్టాలు..

- వరికొయ్యలను కాలిస్తే భూసారం దెబ్బతింటుంది. తేమను కలిగి ఉండే మట్టి తన సహజగుణాన్ని కోల్పోతుంది.
- నేలలో సహజసిద్ధంగా ఉండే సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నశిస్తాయి.
- నత్రజనిలాంటి పోషక పదార్థాలు క్షీణిస్తాయి.
- కొన్నేళ్లుగా భూసారమంతా తగ్గిపోవడంతో సాగుకు పనికి రాకుండా పోతుంది.
- కాల్చడంతో వచ్చే దట్టమైన పొగతో రైతు ఆరోగ్యం దెబ్బతింటుంది.
- మంటలు పెద్దవైతే పక్కనే గల ఇతర పంటలు వస్తువులు కాలిపోతాయి.

కాల్చడం మానేశాను



గతంలో అవగాహన లేక వరికొయ్యలను కాల్చేవాళ్లం. వ్యవసాయాధికారుల సూచనతో మానేశాం. ఇప్పుడు దుక్కితో దున్నేసి సేంద్రియ ఎరువుగా మార్చుకుంటున్నాం. భూసారం పెరుగుతోంది. పంటకు అవసరమైన పోషకాలు దొరుకుతున్నాయి.

– మామిడి సునీల్‌రెడ్డి, ధర్మోర రైతు

అవగాహన కల్పిస్తున్నాం



వరి కొయ్యలు కాల్చవద్దని రైతులకు సూచిస్తున్నాం. దీని వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నాం. అవగాహన ఉన్నవారు కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకుంటున్నారు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్

డిగ్రీ ప్రవేశాలకు వేళాయె..

- నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- మూడు విడతల్లో ప్రవేశాలు

బోథ్: తెలంగాణలో డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈమేరకు ఉన్నత విద్యామండలి శుక్రవారం వివరాలు వెల్లడించింది. ప్రవేశాల ప్రక్రియను మూడు విడతల్లో పూర్తి చేయనుంది. ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరానికి సంబంధించిన సీట్లు భర్తీ చేయనుంది. శనివారం నుంచి విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్, మీసేవా, టీ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 91 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.

కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి

ఫస్ట్ ఫేజ్‌లో సీట్లు పొందే విద్యార్థులు మే 30 నుంచి జూన్ 6లోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. రెండు, మూడు విడతలో సీట్లు పొందే వారు ఆయా కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. అలా చేయకపోతే సీటు రద్దవుతుంది. ఫస్ట్ సెమిస్టర్ తరగతులు జూన్ 30 నుంచి ప్రారంభమవుతాయి.

రిజిస్ట్రేషన్లు ఇలా..

- ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం కోసం దోస్త్ వెబ్‌సైట్‌లో www.dost.cgg.gov.in రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కళాశాలలను ఎంచుకోవాలి. ఇంటర్‌లో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. సీట్లు మిగిలితే స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్లు వస్తాయి. వీటిపై ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంటుంది.
- దోస్త్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ల అప్‌డేట్స్ తెలుసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ల ఫీజుతోపాటు వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపు, అలాట్‌మెంట్ కాపీలు పొందటం వంటి ప్రక్రియలు పూర్తి చేసుకోవచ్చు.

ప్రవేశాలు ఇలా..

- డిగ్రీలో మూడు విడతల ద్వారా ప్రవేశాలకు అవకాశం.
- మొదటి ఫేజ్‌లో భాగంగా నేటి నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. రూ.200 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 21వ తేదీ తుది గడువు. ఈనెల 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 29న మొదటి ఫేజ్ సీట్ల కేటాయింపు ఉంటుంది.
- రెండోవిడత కింద ఈనెల 30 నుంచి జూన్ 8 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. 13న సీట్ల కేటాయింపు ఉంటుంది.
- మూడో విడత ప్రక్రియ జూన్ 13 నుంచి షురూ అవుతుంది. జూన్ 19 తుది గడువుగా నిర్ణయించింది. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు, 23న సీట్ల కేటాయింపు ఉంటుంది.

ఉత్తీర్ణత సాధించేలా తరగతులు నిర్వహించాలి

ఇంద్రవెల్లి: ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఇంటర్ బోర్డు రాష్ట్ర పరిశీలకుడు వెంకటేశ్వర్ అన్నారు. మండలంలోని లింగ్‌గూడలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలు, ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మే నెల పూర్తిగా అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనలపై నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు మధుకర్, ప్రమీల, దళిత్ తదితరులు ఉన్నారు.



అధ్యాపకులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్

ఆర్టీఐ పేరిట డబ్బులు డిమాండ్

- ముగ్గురి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పాఠశాలపై ఆర్టీఐ వేసి డబ్బులు డిమాండ్ చేసిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని విద్యానగర్‌లో చాణక్య పాఠశాలకు సంబంధించి భుక్తాపూర్‌కు చెందిన ఎండీ అర్షద్, షేక్ సమద్, తాటిగూడకు చెందిన షేక్ యూసుఫ్‌లు ఆర్టీఐ వేశారు. పాఠశాల యజమాని, మైనార్టీ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అమీరొద్దీన్ ఆ ముగ్గురిని ఆర్టీఐ వివరాలు ఇస్తానని ఇటీవల పిలిచాడు. తమకు ఆర్టీఐ వివరాలు వద్దని, తాము (ఐయూఎంఎల్) ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ ఏర్పాటు చేశామని, పార్టీ ఫండ్ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేశారు. శుక్రవారం ఎండీ అర్షద్, షేక్ యూసుఫ్, షేక్ సమద్‌లను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

జొన్నలేప తిని 20 ఆవులు మృతి

బజార్‌హత్నూర్: మేతకు వెళ్లిన ఆవులు జొన్న లేప తిని మృత్యువాతపడ్డాయి. మండలంలోని బుర్కపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్ కథనం ప్రకారం.. గ్రామంలో 45 ఆవులు శుక్రవారం పశుగ్రాసం మేయడానికి వెళ్లాయి. పంట చేనులో జొన్న లేప (కోత తర్వాత జొన్న కాండానికి మొలిచిన మొలకలు) తిని 20 ఆవులు మృతిచెందాయి. మిగతా ఆవులకు సకాలంలో వైద్య చికిత్స అందించడంతో ప్రాణాలతో బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న ఎంఆర్ఐ నూర్‌సింగ్, ఏఎస్సై లింబాజీ ఘటనస్థలానికి చేరుకుని మృతిచెందిన ఆవులను పరిశీలించారు. కాగా బర్దవల్ నానక్‌సింగ్‌కు చెందిన 3 ఆవులు, టాక్ల నానక్‌సింగ్ 4, హుషార్‌సింగ్ 2, కపూర్‌చంద్ 2, గులాబ్ సింగ్, గురువేసింగ్, చందర్‌సింగ్, న్యాల్‌సింగ్, సుభాష్, బాన్య రామ్, బామన్ పరుశురాం, హరిసింగ్, గోపిచంద్‌లకు చెందిన ఒక్కొక్క ఆవులు మృతి చెందాయి.



ఆవులకు చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఇద్దరు వేర్వేరు కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య కాపురానికి రావడం లేదని భర్త ఉరేసుకున్నాడు. మద్యానికి బానిసైన యువకుడు ఆర్థిక ఇబ్బందులతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

భార్య కాపురానికి రావడం లేదని..



రవికిరణ్ మృతదేహం

తానూరు: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మహలింగి గ్రామానికి చెందిన బన్సోడే రవికిరణ్ (34)కు ముథోల్ మండలం సరస్వతినగర్‌కు చెందిన జ్యోతితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఇప్పటివరకు సంతానం కలగడం లేదని బాధతో రవికిరణ్ మద్యానికి బానిసయ్యాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గతేడాది జ్యోతి సరస్వతినగర్‌కు వెళ్లింది. అప్పటి నుంచి తండ్రి సుభాష్‌తో రవికిరణ్ ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్య కాపురానికి రాకపోవడం, ఒంటరి జీవితం భరించలేక తీవ్ర మనస్తాపంతో గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం తండ్రి గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ట్రెయినీ ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..



దుర్గాప్రసాద్ మృతదేహం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల, రవీంద్రఖని రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. తీగల్‌పహాడ్‌కు చెందిన పైడి దుర్గా ప్రసాద్ (28) మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపం చెందాడు. జీవితంపై విరక్తితో శుక్రవారం ఉదయం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శంకరమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

గల్ఫ్ కార్మికుడి ఆచూకీ కోసం వినతి



ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న కుటుంబీకులు, నాయకులు

ఖానాపూర్: మండలంలోని గోడలపంపు గ్రామానికి చెందిన సింగం రాజేశ్వర్ ఉపాధి నిమిత్తం ఆరేళ్ల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న ఆయన రెండేళ్లుగా ఎలాంటి సమాచారం లేకుండా పోయింది. కుటుంబీకులు, టీపీసీసీ రాష్ట్ర మహిళా నాయకురాలు అల్లూరి కృష్ణవేణి ప్రత్యేక చొరవతో శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద ప్రవాసీ ప్రజావాణిలో కేంద్రం ఇన్‌చార్జి అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గల్ఫ్ కార్మికుడి ఆచూకీ కనుగొని వెంటనే ఇండియాకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబీకులతో కలిసి విన్నవించారు. కాంగ్రెస్ మహిళా నాయకురాలు రేఖాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఇంట్లో చోరీ



సీసీ పుటేజీలో గుర్తుతెలియని వ్యక్తి

బాసర: మండలంలోని టాక్లి గ్రామంలోని గిరిజనవాడలో శుక్రవారం వేకువజామున దావనే గంగాధర్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.30 వేల నగదు, తులం బంగారం వస్తువులను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గంగాధర్ ఇంటి పక్కన ఉన్న జారికొట్ బాబురావు ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలో గుర్తుతెలియని వ్యక్తులు చిక్కారు. వీరిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టు

- మహిళపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టుచేసిన మహిళపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన పతంగె స్వప్న ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టు చేయడంపై పోలీసులు సుమోటోగా తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

లక్సెట్టిపేట వరకు జాతీయ రహదారి పొడిగించాలి

- జన్నారం మండల అభివృద్ధి కమిటీ నాయకులు
- ఎంపీ గోడం నగేశ్‌కు వినతి

జన్నారం: జాతీయ రహదారిని కడెం, జన్నారం, దండేపల్లి మీదుగా లక్సెట్టిపేట వరకు పొడిగించేలా చూడాలని జన్నారం మండల అభివృద్ధి కమిటీ నాయకులు కోరారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముంబయి నుంచి నిర్మల్ మీదుగా ఖానాపూర్ వరకు ఉన్న జాతీయ రహదారిని అటవీ అనుమతులు తీసుకుని కడెం, జన్నారం, దండేపల్లి మీదుగా లక్సెట్టిపేట వరకు పొడిగించాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈనెల 5న ఆదిలాబాద్‌కు వస్తున్నారని, ఆయన దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. లక్సెట్టిపేట నుంచి జన్నారం మీదుగా రహదారుల గుండా వాహనాల రాకపోకలపై అటవీశాఖ ఆంక్షలు ఎత్తివేసి, రాకపోకలను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జన్నారంలో 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విన్నవించినట్లు తెలిపారు. జన్నారం అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరాముల కొండయ్య, కో కన్వీనర్ కోడూరి చంద్రయ్య, బీసీ సంఘం అధ్యక్షులు గూడ అశోక్, పెరక సంఘం అధ్యక్షులు ఎంబడి సత్తన్నతోపాటు మేనేని శ్రీనివాస్ రావు, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు షబ్బీర్ పాషా, మైనార్టీ నాయకులు షేక్ అక్బర్ పాల్గొన్నారు.



ఎంపీ నగేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న మండల అభివృద్ధి కమిటీ నాయకులు

వీహబ్ ప్రతినిధులతో చర్చ

బాసర: విద్య, పరిశోధన, సాంకేతిక రంగాలతోపాటు మహిళలకు స్వయం ఉపాధి కోసం పరస్పర సహకారం అందించేందుకు బాసర ఆర్జీయూకేటీ, వీహబ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయు)పై చర్చలు జరిగాయి. బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ సమక్షంలో వీహబ్ ప్రతినిధులు, ఓఎస్డీ, ఏవోలతో చర్చించారు. ఈ ఒప్పందం ద్వారా విద్య మౌలిక సదుపాయాలు, పరిశోధనకు ప్రోత్సాహం, శిక్షణలు, ఇంటర్న్‌షిప్‌లు, సంయుక్త ప్రాజెక్టులు వంటి అవకాశాలు మెరుగవుతాయని ఇన్‌చార్జి వీసీ తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 15న సీఎం రేవంత్రెడ్డి సమక్షంలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, వీహబ్ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం జరగనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ దిల్బార్, అసోసియేట్ డీన్, ప్లేస్మెంట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

256 క్వింటాళ్ల జొన్నలు పట్టివేత

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 256 క్వింటాళ్ల జొన్నలను ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు మాదపూర్‌లో శివారులో సజ్జద్ రేకులషెడ్డులో తనిఖీ చేయగా నిల్వ ఉన్న జొన్నలు లభ్యమయ్యాయి. ఆర్ఐ హుస్సేన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పంచనామా నిర్వహించి అనుమానాస్పదంగా ఉన్న జొన్నలను సీజ్ చేసి వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జొన్నలు తరలిస్తున్న ట్రాలీ వాహనం..

ఇంద్రవెల్లి: అక్రమంగా జొన్నలను ట్రాలీ వాహనంలో తరలిస్తుండగా మండలంలోని హీరాపూర్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పట్టుకున్నట్లు వ్యవసాయ మార్కెట్, రెవెన్యూ అధికారులు తెలిపారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని ఏమాయికుంటకు చెందిన వ్యాపారి నారాయణ ట్రాలీలో జొన్నలు తరలిస్తున్నట్లు సమాచారం అందింది. చెక్‌పోస్టు వద్ద ట్రాలీ వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న 45 క్వింటాళ్ల జొన్నలను సీజ్ చేశారు. ఆ జొన్నలను ప్రభుత్వ గోదాంలో భద్రపర్చగా, ట్రాలీ వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు.



మాదపూర్‌లో జొన్నలు పట్టుకున్న పోలీసులు